సొంతింటి కల.. నెరవేరిన వేళ..

- జగనన్న కాలనీల్లో జోరుగా నిర్మాణాలు
- లబ్ధిదారులకు ప్రభుత్వ తోడ్పాటు

అనపర్తి: సొంత ఇల్లు.. ప్రతిఒక్కరికీ ఓ అందమైన కల.. నవరత్నాల్లో భాగంగా పేదలందరికీ ఇళ్లు పథకానికి శ్రీకారం చుట్టిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దేశ చరిత్రలో తొలిసారిగా లక్షలాది మందికి ఇళ్ల స్థలాలు మంజూరు చేయడంతో పాటు ఇళ్ల నిర్మాణాలకు అవసరమైన వనరులు సమకూరుస్తూ తోడ్పాటును అందిస్తున్నారు. దీనివల్ల పూరి గుడిసెలు, అద్దె ఇళ్ల నుంచి పేదలకు ఉపశమనం లభిస్తోంది. ప్రభుత్వ సహకారంతో పేదోడి సొంతింటి కల సాకారమవుతోంది. పక్కా ఇళ్ల నిర్మాణాలతో పేదల జీవితాల్లో వెలుగులు నిండుతున్నాయి.

పేదలకు స్థలాలు మంజూరు చేయడంతో పాటు ఇళ్లు నిర్మించుకునేందుకు ప్రభుత్వం అండగా నిలవడంతో జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు శరవేగంగా జరుగుతున్నాయి. మండల పరిధిలోని అనపర్తి శివారు కొత్తూరు, దుప్పలపూడి, లక్ష్మీనరసాపురం గ్రామాల్లో 3 లేఅవుట్లలో 56.33 ఎకరాల్లో మొత్తం 2,318 మంది లబ్ధిదారులకు ప్రభుత్వం ఇళ్ల స్థలాలు కేటాయించింది. అదేవిధంగా సొంత స్థలాలు ఉండి ఇళ్లు కట్టుకోని సుమారు 190 మందికి ప్రభుత్వం గృహ నిర్మాణాలకు రుణాలు మంజూరు చేసింది. జగనన్న లేఅవుట్లో సుమారు 1,767 ఇళ్ల నిర్మాణాలు వివిధ దశల్లో ఉన్నాయి. ఇప్పటివరకూ సుమారు 551 మంది లబ్ధిదారులు గృహ నిర్మాణాలు పూర్తి చేసుకుని గృహప్రవేశాలు చేశారు. జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలకు సంబంధించి ప్రభుత్వం సుమారు రూ.14.50 కోట్లు ఖర్చు చేసింది.



అడుగడుగునా ప్రభుత్వ తోడ్పాటు

ఇళ్ల నిర్మాణాలకు గాను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా ఒక్కో గృహానికి రూ.1.80 లక్షలు కేటాయిస్తోంది. బేస్‌మెంట్, రూఫ్ లెవెల్, శ్లాబ్ ఇలా దశల వారీగా నిర్మాణాలు పూర్తి చేసిన లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలకు నగదు జమచేస్తున్నారు. ఈ సొమ్ముకు అదనంగా డీఆర్‌డీఏ విభాగం ద్వారా స్వయం సహాయక సంఘాల సభ్యులకు మరో రూ.35 వేలు రుణంగా ప్రభుత్వం అందిస్తోంది. జగనన్న కాలనీల్లో మౌలిక వసతుల కల్పనకు అధిక ప్రాధాన్యమిస్తున్న ప్రభుత్వం తాగునీరు, విద్యుత్, రహదారులు తదితర సౌకర్యాలు కల్పనకు చొరవ చూపుతోంది. ఇప్పటికే మూడు లేఅవుట్లలో పూర్తి స్థాయిలో విద్యుత్ సౌకర్యం ఏర్పాటుచేశారు. ఇంటింటికీ తాగునీటి కుళాయిలు ఏర్పాటుకు సంబంధించిన టెండర్ ప్రక్రియ పూర్తయినట్లు అధికారులు చెబుతున్నారు. జగనన్న కాలనీల్లో మొదటి ఫేజ్‌లో ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను అధికారులు పూర్తి చేశారు. ఫేజ్–2లో 1,154 ఇళ్ల నిర్మాణాలు పూర్తి కావాలన్న ఆదేశాలకు అనుగుణంగా లబ్ధిదారులకు అవసరమైన అన్ని ఏర్పాట్లుచేస్తున్నారు.

దశాబ్దాల కల నెరవేరింది



సీఎం జగనన్న దయవల్ల జగనన్న కాలనీలో సొంతిల్లు నిర్మించుకున్నాం. దశాబ్దాల కల నెరవేరింది. ఇళ్లు నిర్మించుకుంటున్న లబ్ధిదారులకు ప్రభుత్వం దశలవారీగా వెంటవెంటనే బిల్లులు చెల్లిస్తోంది. పేదల సొంతింటి కల సాకారం చేస్తున్న జగనన్నకు కృతజ్ఞతలు.

– ఐ.సత్యనారాయణ, దుప్పలపూడి, అనపర్తి మండలం

సొంతింటి బెంగ తీరింది



సొంత గూడుకు నోచుకోక, అద్దె ఇళ్లలో ఇంటి అద్దెలు కట్టలేక తీవ్ర ఇబ్బందులు పడేవాళ్లం. అనపర్తి శివారు కొత్తూరులోని జగనన్న కాలనీలో ఇంటి స్థలం రావడంతో ఇల్లు నిర్మించుకుంటున్నాం. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చొరవతో ఎంతో మంది పేదలకు సొంతిల్లు లేదనే బెంగ తీరుతోంది.

– జి.విజయదుర్గ, అనపర్తి

జగనన్నకు రుణపడి ఉంటాను



సొంతిల్లు లేక ఏటికేడు పెరిగిపోతున్న అద్దెలు చెల్లించలేని పరిస్థితుల్లో జగనన్న కాలనీలో స్థలం కేటాయించడంతో పక్కా గృహం నిర్మించుకుంటున్నాను. సొంతింటిలో ఉండే అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి జీవితాంతం రుణపడి ఉంటాను. పేదల ఇబ్బందులు తెలుసుకుని వారిని అన్ని విధాలా ఆదుకుంటున్నారు.

– ఎస్.విజయకుమారి, కొత్తూరు, అనపర్తి

క్లుప్తంగా

మహా చండీ హోమం



మహా చండీ హోమంలో పాల్గొన్న ఎమ్మెల్యే సతీమణి సత్తి ఆదిలక్ష్మి

పెదపూడి: జి.మామిడాడ శివారు ఎల్ఎస్‌పురంలోని మెరకవీధిలో శ్రీబాలగజానన కమిటీ నెలకొల్పిన వినాయక మండపంలో సోమవారం మహా చండీ హోమం నిర్వహించారు. ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి సతీమణి సత్తి ఆదిలక్ష్మి పాల్గొని పూజలు చేశారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. జి.మామిడాడలోని బల్లపందిరి వద్ద వినాయకునికి మహాలక్ష్మి గణపతి అభిషేకం, లక్ష గరిక పూజ జరిపారు. కార్యక్రమంలో కొవ్వూరి వెంకటరెడ్డి, నల్లమిల్లి భూలోకరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అతిక్రమిస్తే చర్యలు

మధురపూడి: కోరుకొండ పోలీసు స్టేషన్ పరిధిలో సెక్షన్ 30, 144 అమల్లో ఉన్నాయని ఎస్సై కట్టా శారదా సతీష్ తెలిపారు. ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడుతూ సభలు, ధర్నాలు, ఊరేగింపులు, బైక్ ర్యాలీలు నిర్వహించకూడదన్నారు. అతిక్రమించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఘనంగా ఫార్మసీ దినోత్సవం

రాజానగరం: గైట్ స్కూల్ ఆఫ్ ఫార్మసీలో ప్రపంచ ఫార్మసీ దినోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన, రంగవల్లుల పోటీలు, రక్తదానం కార్యక్రమాలను నిర్వహించారు. రక్తదానం ఎవరు చేయవచ్చు, ఎప్పుడు చేయవచ్చు, కలిగే ప్రయోజనాలపై ప్రభుత్వ వైద్యురాలు డాక్టర్ పి.సుజాత అవగాహన కల్పించారు. అనంతరం పోటీలలో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎండీ ధనరాజ్, ఎన్ఎస్ఎస్ పీఓ షేక్ మీరా, అధ్యాపకులు పాల్గొన్నారు.

అన్న సమారాధన

బిక్కవోలు: కొంకుదురు తూర్పుపేటలో ఏర్పాటుచేసిన శ్రీబాలగణపతి ఆలయ మండపం వద్ద సోమవారం భారీ అన్నసమారాధన నిర్వహించారు. ఆలయం వద్ద గణపతికి ప్రత్యేక పూజలు చేసి అనంతరం కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో అన్నసమారాధన చేశారు. .

మధురపూడి: కోరుకొండ మండలం కాపవరం విఘ్నేశ్వరస్వామి ఆలయం వద్ద సోమవారం అన్నసమారాధన నిర్వహించారు. స్థానికులతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి అన్నప్రసాదం స్వీకరించారు. వైఎస్సార్ సీపీ నాయకుడు నీరుకొండ బాబ్జీ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.

ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులతో ఆరోగ్యం



ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల స్టాల్‌ను ప్రారంభిస్తున్న ఎంపీపీ శ్రీవల్లి

గోకవరం: ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులతో ఆరోగ్యం మెరుగుపడుతుందని ఎంపీపీ సుంకర శ్రీవల్లి, జెడ్పీటీసీ దాసరి శ్రీరంగ అన్నారు. గోకవరం మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ప్రదర్శించిన ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల స్టాల్‌ను సోమవారం వారు ప్రారంభించారు. ఈ స్టాల్‌లో ఎరువులు వేయకుండా సహజ సిద్ధంగా పండించిన కూరగాయలు, బియ్యం, అరటిపండ్లను ప్రదర్శించారు. ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులను ఆహారంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు సుంకర వీరబాబు, వరసాల ప్రసాద్, ఎంపీడీఓ పద్మజ్యోతి, రైతు కొరిపల్లి అప్పలస్వామి పాల్గొన్నారు.

డిజిటల్ చెల్లింపులు ప్రారంభించాలి

సీతానగరం: మండలంలోని అన్ని పంచాయతీలూ డిజిటల్ చెల్లింపులు ప్రారంభించాలని ఈవోపీఆర్డీ కేవీఎస్ఎస్ఎస్ మూర్తి పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం మండలంలోని 21 మంది పంచాయతీ గ్రేడ్ 1 నుంచి గ్రేడ్ 6 వరకూ కార్యదర్శులకు డిజిటల్ చెల్లింపులపై అవగాహన కల్పించారు. ఈవోపీఆర్డీ మాట్లాడుతూ పది రోజుల నుంచి చిన కొండేపూడి, సీతానగరం, మిర్తిపాడు, వంగలపూడి పంచాయతీలు డిజిటల్ చెల్లింపులు ప్రారంభించాయన్నారు. అన్ని పంచాయతీలకు యూనియన్ బ్యాంక్‌లో ఖాతాలు తెరిచామన్నారు. ఉండేశ్వరపురం, ములకల్లంక, జాలిమూడి, నాగంపల్లిలో త్వరలో స్వమిత్ర సర్వే ప్రారంభిస్తామని, మిగిలిన పంచాయతీలు 36 కాలమ్ ప్రోఫార్మాను సిద్ధం చేయాలని సూచించారు.

స్పందన కార్యక్రమం

మధురపూడి: కోరుకొండ తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ పాపారావు సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించారు. అయితే సమస్యలపై ప్రజలెవ్వరూ అర్జీలు అందజేయలేదు. స్థానికంగా సచివాలయాల్లోనే అన్ని సమస్యలూ పరిష్కారం అవుతుండడంతో అర్జీలు రాలేదు.

రాట ముహూర్తం

గోకవరం: స్థానిక వీరభద్రుని గద్దెలో కొలువైన కనక దుర్గమ్మ ఆలయం వద్ద దసరా ఉత్సవాలకు సోమవారం పందిరి రాట వేశారు. అర్చకులు ప్రవీణ్ శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ అక్టోబర్ 15 నుంచి తొమ్మిది రోజుల పాటు శరన్నవరాత్ర ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.

ఎలుకల నిర్మూలనతో అధిక దిగుబడులు



రైతులకు ఎలుకల నివారణ మందు పంపిణీ చేస్తున్న సర్పంచ్ గిరడా గంగాభవాని తదితరులు

అనపర్తి: సామూహిక ఎలుకల నిర్మూలనతో వ్యవసాయంలో అధిక దిగుబడులు సాధించొచ్చని సర్పంచ్ గిరడా గంగాభవాని అన్నారు. సామూహిక ఎలుకల నివారణ కార్యక్రమంలో భాగంగా సోమవారం రామవరంలో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో రైతులకు ఎలుకల మందు పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన సర్పంచ్ గంగాభవాని మాట్లాడుతూ ప్రభుత్వం ఉచితంగా పంపిణీ చేసే బ్రోమోడయోలిన్ మందును రైతులు ఎలుకల బొరియల్లో పెట్టడం వల్ల ఎలుకల నిర్మూలన సాధ్యమవుతుందన్నారు. అనంతరం రైతులకు ఎలుకల మందు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు నల్లమిల్లి భాగ్యలక్ష్మి, వైఎస్సార్ సీపీ నాయకులు నల్లమిల్లి వెంకటరెడ్డి, వ్యవసాయశాఖ సహాయక అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సమరయోధుల త్యాగాలను స్మరించుకోవాలి



గ్రామంలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు



సీతానగరంలో ర్యాలీ చేస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

అనపర్తి: దేశ స్వాతంత్య్రం కోసం ప్రాణాలర్పించిన సమరయోధుల త్యాగాలను స్మరించుకోవాలని స్థానిక పాతవూరులోని కేఏఆర్ జెడ్పీ ఉన్నత పాఠశాల ఇన్‌చార్జ్ హెచ్‌ఎం వై.రాంబాబు అన్నారు. సోమవారం నా మట్టి–నా దేశం కార్యక్రమంలో భాగంగా పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు జాతీయ జెండా, దేశ నాయకుల చిత్రపటాలను ప్రదర్శిస్తూ గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ కుల మతాలు, భాషలు వేరైనా అందరం భారతీయులమేనన్న భావన ప్రతిఒక్కరిలో ఉండాలన్నారు.

విద్యార్థుల ర్యాలీ

సీతానగరం: నా భూమి – నాదేశం కార్యక్రమంలో భాగంగా సీతానగరం ప్రభుత్వ హైస్కూల్ విద్యార్థులు సోమవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవో కె.స్వామి నాయక్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తలపెట్టిన ఈ కార్యక్రమాన్ని బుధవారం వరకూ మూడు రోజుల పాటు నిర్వహిస్తామన్నారు. తొలిరోజు ర్యాలీ నిర్వహించామన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఎం.వీరభద్రరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆజాదీకా అమృత్ మహోత్సవ్

బిక్కవోలు: మండలంలోని కొంకుదురు ఉన్నత పాఠశాలలో ఆజాదీకా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా నా మట్టి–నా దేశం కార్యక్రమం సోమవారం నిర్వహించారు. విద్యార్థులు సంప్రదాయ దుస్తులు ధరించి జాతీయ జెండాలతో ర్యాలీగా తుల్యభాగ నదీ తీరానికి వెళ్లి గంగమ్మతల్లికి హారతి కర్పూరంతో నీరాజనం పలికారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్‌ఎం మల్లిపూడి శ్రీనివాస్ మాట్లాడుతూ ఇటువంటి కార్యక్రమాలు పాఠశాల స్థాయిలో నిర్వహించడం వల్ల, జాతీయ సమైక్యత పెంపొందుతుందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పడాల ఈశ్వర్‌రెడ్డి, లక్ష్మణరెడ్డి, అప్పారావు, వలీషా, సుధాకర్‌రెడ్డి, చౌదరి తదితరులు పాల్గొన్నారు.



కొంకుదురులో గంగమ్మ తల్లికి హారతి ఇస్తున్న విద్యార్థులు

సమస్యలు పరిష్కరించాలని వినతి



ఎంపీడీవో రమేష్‌కు వినతిపత్రం అందిస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లు

సీతానగరం: తమ సమస్యలను పరిష్కరించాలంటూ ఎన్ఆర్ఈజీఎస్ మండల ఫీల్డ్ అసిస్టెంట్ల యూనియన్ అధ్యక్షుడు సాకిరీ రాంబాబు ఆధ్వర్యంలో సోమవారం ఎంపీడీవో కె.రమేష్‌కు వినతిపత్రం అందించారు. ముందుగా మండల పరిషత్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. జిల్లా అధ్యక్షుడు ప్రకాష్ మాట్లాడుతూ పదిహేడేళ్ల నుంచి సుదీర్ఘ పోరాటం చేస్తున్నప్పటికీ ఫీల్డ్ అసిస్టెంట్లకు ఉద్యోగ భద్రత లేదన్నారు. తమకు ఉద్యోగ భద్రత కల్పించి, కనీస వేతన చట్టం అమలు చేసి, నెలకు రూ.26 వేలు జీతం ఇవ్వాలన్నారు. మండల ఉపాధ్యక్షుడు సుంకవల్లి పోశారావు తదితరులు పాల్గొన్నారు.

క్రీడా పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



క్రీడా పోటీలకు ఎంపికైన విద్యార్థులు

రాజానగరం: నామవరంలోని భారతీయ విద్యాభవన్‌కు చెందిన విద్యార్థులు జిల్లా, రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ వీరేంద్రనాథ్ తెలిపారు. ఏపీ ప్రభుత్వం ఎస్‌జీఎఫ్‌ఐ ఆధ్వర్యంలో కాకినాడలో నిర్వహించిన పోటీలలో అండర్ 14 విభాగంలో జిల్లా స్థాయికి తొమ్మిది మంది ఎంపికయ్యారు. ఖోఖోలో నలుగురు, త్రోబాల్‌లో ఇద్దరు, యోగా విభాగంలో ముగ్గురు ఉన్నారు. స్కేటింగ్ పోటీలలో శ్రీవత్సవ్, శ్రీవత్సల్, సాయిమోక్షశ్రీ, కార్తికేయ రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఆ విద్యార్థులను, క్రీడా ఉపాధ్యాయులను ప్రిన్సిపాల్ అభినందించారు.

అర్హులందరికీ లబ్ధి చేకూర్చడమే లక్ష్యం

- జక్కంపూడి గణేష్
- తోకాడలో గడప గడపకూ..



తోకాడలో ప్రజలతో మాట్లాడుతున్న జక్కంపూడి గణేష్

రాజానగరం: అర్హులందరికీ పథకాలు అందజేయడమే ప్రభుత్వ లక్ష్యమని వైఎస్సార్ సీపీ యువజన విభాగం రీజినల్ కో ఆర్డినేటర్ జక్కంపూడి గణేష్ అన్నారు. మండలంలోని తోకాడలో సోమవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరించారు. వివిధ సంక్షేమ పథకాల ద్వారా ఆయా కుటుంబాలకు చేకూరిన ప్రయోజనాలను తెలిపారు. ఇదే సమయంలో సమస్యలు ఏమైనా ఉంటే నిర్భయంగా చెప్పాలని, వాటి పరిష్కారానికి స్థానిక ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా సహకారంతో కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ వేగిశెట్టి వీర వెంకట చక్రధరరావు, నెడ్‌క్యాప్ డైరెక్టర్ గండి నానిబాబు, స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

కృషి, పట్టుదలతో ఎంతటి లక్ష్యాన్నైనా సాధించొచ్చు



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఏఎంసీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి

అనపర్తి: కృషి, పట్టుదల ఉండే ఎంతటి లక్ష్యాన్నైనా అలవోకగా సాధించవచ్చని అనపర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి అన్నారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్ 14, 17 బాలబాలికల విభాగంలో నిర్వహించే ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా క్రీడాకారుల ఎంపికలు సోమవారం స్థానిక జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిన కృష్ణారెడ్డి మాట్లాడుతూ క్రీడా పోటీల ద్వారా సమష్టితత్వం, క్రీడా స్ఫూర్తి పెంపొందుతాయన్నారు. అనంతరం వ్యాయామ ఉపాధ్యాయులను సత్కరించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కర్రి దాసు, సత్తి వెంకటరెడ్డి, పడాల శ్రీనివాస్‌రెడ్డి, హెచ్‌ఎం వెంకటరెడ్డి, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి ఎస్ఆర్‌కేవీ స్వామి, జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడు ఏవీడీ ప్రసాద్, కోనసీమ జిల్లా కార్యదర్శి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

వ్యాపార నిర్వహణపై అవగాహన



విద్యార్థులతో మాట్లాడుతున్న మల్లిబాబు

రాజానగరం: దివాన్ చెరువులోని షిర్డీసాయి విద్యానికేతన్‌లో విద్యార్థులకు బిజినెస్ అడ్మినిస్ట్రేషన్‌పై అవగాహన కలిగిస్తూ సురుచి ఫుడ్స్ అధినేత పోలిశెట్టి మల్లిబాబు ఆధ్వర్యంలో సోమవారం పెప్ టాక్ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా తన వ్యాపార ప్రస్థానం, లావాదేవీలు, వ్యూహాలు, ఆర్థిక బ్యాలెన్స్‌లు, భావోద్వేగాల గురించి వివరించారు. భావితరాల పారిశ్రామికవేత్తలు, ఐఐఎంలను లక్ష్యంగా చేసుకుని ఐపీమేట్ పరీక్షలకు హాజరయ్యే సీబీఎస్ఈ విద్యార్థులతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆత్మవిశ్వాసాన్ని, శ్రమతత్వాన్ని, విజయ పథాలను అందుకునే విధానాలపై విద్యార్థులను చైతన్యపరుస్తూ కార్యక్రమం సాగింది.

సమయపాలన, ఏకాగ్రతతో లక్ష్యసాధన



ఆరు పతకాలు అందుకున్న ఎంబీబీఎస్ ఫైనలియర్ విద్యార్థిని పసుపులేటి లక్ష్మీత్రిష

- ప్రముఖ మానసిక వైద్యుడు కర్రి రామారెడ్డి
- ఘనంగా జీఎస్ఎల్ వైద్య కళాశాల వార్షికోత్సవం

రాజానగరం: ఎంచుకున్న లక్ష్యాన్ని సాధించాలంటే తపనతో పాటు సమయ పాలన, ఏకాగ్రత ఉండాలని ప్రముఖ మానసిక వైద్యుడు డాక్టర్ కర్రి రామారెడ్డి అన్నారు. స్థానిక జీఎస్ఎల్ వైద్య కళాశాల వార్షికోత్సవం సోమవారం రాత్రి ఘనంగా జరిగింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ లక్ష్యాన్ని ఎంచుకోవడమే కాదు, దానిని సాధించాలనే చాలెంజ్‌తో ముందుకెళ్లాలని సూచించారు. మీ వయసులో ఉండగా వైద్య విద్యను అభ్యసించాలనుకున్నానని, కానీ ఎంబీబీఎస్‌లో ఫ్రీ సీటు రాక రూ. 7500 డొనేషన్ కట్టానని, అయినా గానీ వెయిటింగ్ లిస్టులో ఉండక తప్పలేదన్నారు. దీనితో వైద్య విద్యను ఒక చాలెంజ్‌గా తీసుకుని, ఆ పై ప్రతి ఏటా గోల్డ్ మెడల్స్ అందుకుంటూనే ఉన్నానంటూ తన స్వీయ అనుభవాన్ని వైద్య విద్యార్థులకు వివరించారు. కళాశాల చైర్మన్ డాక్టర్ గన్ని భాస్కరరావు మాట్లాడుతూ వైద్య శాస్త్రంతో పాటు ఇతర శాస్త్రాలలో ఇంతవరకు 34 డిగ్రీలు పూర్తి చేశారని డాక్టర్ కర్రి రామారెడ్డి గురించి విద్యార్థులకు తెలియజేశారు. ప్రిన్సిపాల్ డాక్టర్ వి.గురునాథ్ వైద్య కళాశాల ప్రగతిని వివరించారు. చదువులో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు పతకాలు అందజేశారు.

నిస్వార్థ సేవలతో దైవానుగ్రహం

రంగంపేట: నిస్వార్థ సేవలతో దైవానుగ్రహం పొందొచ్చని సత్యసాయి సేవా సంస్థల జిల్లా అధ్యక్షుడు బలుసు వెంకటేశ్వర్లు అన్నారు. మండల పరిధిలోని ఈలకొలనులో సోమవారం నిర్వహించిన పుష్కర ప్రదేశ ఎనిమిదో సత్యసాయి భజనామృతానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. భగవాన్ సత్యసాయి బాబా శత జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని వచ్చే నెల 1వ తేదీన రాజమహేంద్రవరం శ్రీరామనగర్, 8వ తేదీన సీతానగరం, 24వ తేదీన రంగంపేట, 29వ తేదీన రాజమహేంద్రవరం ఆల్కాట్ గార్డెన్స్‌ల వద్ద సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో భజనలు జరగనున్నాయన్నారు. ఈ నెల 26 నుంచి 29 వరకూ డిగ్రీ, ఇంటర్, 8 నుంచి 10వ తరగతి చదివే విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో సత్యసాయి సేవా సమితి కన్వీనర్ తిక్కిశెట్టి సుబ్బారావు, కాకినాడ జిల్లా అధ్యక్షుడు యార్లగడ్డ గోవిందరాజులు, జిల్లా సేవాదళ్ కన్వీనర్ పాలచర్ల శ్రీనివాస్, తుని సజ్జోన్ కన్వీనర్ తుమ్మలపల్లి జోగేంద్రనాథ్, నిడదవోలు సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.



ఈలకొలనులో సత్యసాయిబాబాకు పూజలు చేస్తున్న జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్లు

గల్లంతైన వ్యక్తి మృతదేహం లభ్యం

అడ్డతీగల: మండలంలో పింజరికొండ జలపాతంలో ఆదివారం గల్లంతైన తూర్పుగోదావరి జిల్లా కోరుకొండ మండలం నరసాపురానికి చెందిన డొక్కా భద్ర వెంకట శివరామకృష్ణ (55) మృతదేహం సోమవారం లభ్యమైంది. పింజరికొండ జలపాతం చూసేందుకు ఆదివారం స్నేహితునితో కలిసి వచ్చాడు. ఇద్దరు జలపాతం ఎగువన బండరాయిపై కూర్చున్నాడు. అదే సమయంలో హఠాత్తుగా ఏలేరు వాగు ఉధృతి పెరగడంతో ఇద్దరు ప్రవాహంలో పడిపోయారు. వీరిలో స్నేహితుడు బయటకు రాగా శివరామకృష్ణ కొట్టుకుపోయాడు. వెంటనే సమాచారం తెలుసుకున్న అడ్డతీగల పోలీసులు, పింజరికొండ వాసులు అతని జాడ కోసం ఆదివారం సాయంత్రం నుంచి గాలించారు. సోమవారం సాయంత్రం లభ్యమైందని పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక సీహెచ్‌సీకి వారు తీసుకువచ్చారు. ఇలావుండగా మృతుడు శివరామకృష్ణ కోరుకొండ మండలం కోటికేశ్వరం పీహెచ్‌సీ పరిధిలో హెల్త్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నాడు. ఆయనకు భార్య ఉన్నారు.

దాడి ఘటనపై కేసు

సీతానగరం: కాటవరానికిచెందిన కాపా వాసు ఫిర్యాదు మేరకు ఈడుపుగంటి వంశీకృష్ణపై కేసు నమోదు చేశామని ఎస్సై కె.చిరంజీవి సోమవారం తెలిపారు. వివరాలు.. కాటవరంలో వంశీకృష్ణకు చిన్న హోటల్ ఉంది. ఆదివారం రాత్రి పెరుగు ప్యాకెట్‌కు వాసు వెళ్లగా, లేదని వంశీకృష్ణ తెలిపారు. నిన్న ఇచ్చిన పెరుగు ప్యాకెట్ పాడైపోయిందని వాసు అనడంతో వంశీకృష్ణ ఘర్షణకు దిగాడు. ఈ నేపథ్యంలోవాసు చెవిని కొరకగా తీవ్ర రక్తస్రావమైంది. దీంతో అతడు ఇంటికి వెళ్లి పెద్దలకు చెప్పగా, వాసు చిన్నాన్న కాపా వెంకటేశ్వరరావు, చిన్నాన్న కుమారుడు సూరిబాబు వెళ్లి అడుగగా, వారిపైనా వంశీకృష్ణ దాడి చేశాడు.